# ఆంధ్రప్రదేశ్ శాసన సభలో రైతు భరోసా కేంద్రాలపై
# సంక్షిప్త చర్చ తేది: 21.01.2020

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రం అయినందున, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మరియు రైతు సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తోంది. సాగు ఖర్చు తగ్గింపులో మరియు పంటల ఉత్పాదకత పెంపులో నాణ్యమైన ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందుల లభ్యత మరియు సరియైన విస్తరణ సేవలు కీలకపాత్ర పోషిస్తాయి.

ప్రస్తుతము రైతులు వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందుల కొరకు ప్రైవేటు డీలరు కేంద్రాలను ఆశ్రయించడం జరుగుతుంది. ఈ డీలర్ కేంద్రాలు వ్యవసాయ సలహా కేంద్రాలుగా వ్యవహరిస్తూ, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. కొంత మంది డీలర్లు నకిలీ ఉత్పత్తులను మరియు ఆమోదించని ఉత్పత్తులను వారి స్వలాభాల కోసం రైతులకు అంటగట్టడం జరుగుతుంది. వీటి వలన పంట వైఫల్యం చెందడం, తద్వారా రైతులు నష్టపోవడం మరియు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. పంట వైఫల్యం చెందినప్పుడు డీలర్లు/ కంపెనీలు రైతులకు తగిన నష్టపరిహారం అందించడం లేదు.

**రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు:**

ప్రతీ గ్రామంలో నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను రైతులకు అందించడానికి మరియు వ్యవసాయ మరియు అనుబంధ విభాగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని రైతులకు అందించాలనే లక్ష్యంతో ఉత్పాదకాల విక్రయ కేంద్రాలు మరియు రైతు విజ్ఞాన కేంద్రాలు రెండింటినీ ఏకీకృతం చేయడం ద్వారా ప్రతీ గ్రామ సచివాలయంలో **ఒక రైతు భరోసా కేంద్రాన్ని** ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ఈ ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించడం జరుగుతుంది.

**1. వ్యవసాయ ఉత్పాదకాల విక్రయ కేంద్రం (Agri Input shop) :** రైతులకు వారి గ్రామంలోనే వివిధ కంపెనీలకు చెందిన నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మొదలగు వాటిని సరైన ధరకు, సరైన సమయంలో లభ్యమయ్యేటట్లు చూడటం ఈ విక్రయ కేంద్రాల ఏర్పాటు యొక్క ముఖ్య లక్ష్యం. వ్యవసాయ ఉత్పాదకాలను కొనుగోలు చేయదలచిన రైతుల నుండి 'డిజిటల్ కియోస్క్' ల ద్వారా ఆర్డర్లను తీసుకోవడానికి ఏర్పాటు చేయబడినవే ఈ వాస్తవిక (Virtual Shop) విక్రయ కేంద్రాలు. ఈ కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నమూనాలను రైతులు ఎంపిక చేసుకోవడానికి వీలుగా ప్రదర్శనగా ఉంచడం జరుగుతుంది.

**2. రైతు విజ్ఞాన కేంద్రం ( Farmer Knowledge Centre):** ఇది ప్రాథమికంగా ఒక శిక్షణా కేంద్రం. ఇక్కడ వ్యవసాయ మరియు అనుబంధ రంగాల అధికారులు మరియు శాస్త్రవేత్తలు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విషయాలపై శిక్షణను ఇస్తారు. ఈ విజ్ఞాన కేంద్రంలో దృశ్యశ్రవణ

మాధ్యమాలు, మిని భూసార పరీక్షా కేంద్రం, విజ్ఞాన ప్రదర్శనలు, లైబ్రరీలు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. సహజ ప్రకృతి ఉత్పత్తుల తయారీని ప్రదర్శించడం మరియు అవసరమైన రైతులకు తయారీ విధానాన్ని మరియు లభ్యతను కల్పించడం ఈ విజ్ఞాన కేంద్రం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. సాగు వ్యయాన్ని తగ్గించడానికి, పంటల ఉత్పాదకాలను పెంచడానికి ప్రతీ గ్రామంలో డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడిని ప్రభుత్వం నిర్వహిస్తుంది. సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు సరైనా నిర్ణయాలు తీసుకొనే వీలుగా మరియు పొలంబడి కార్యక్రమాలు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇవ్వడానికి ఈ రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తాయి.

**రైతుల భరోసా కేంద్రాల ఏర్పాటు ప్రణాళిక (Rollout Plan):**

ప్రస్తుతం రాష్ట్రంలోని 660 మండలాల్లో, ప్రతీ మండలానికి 5 చొప్పున మొత్తం 3,300 రైతు భరోసా కేంద్రాలను 20.02.2020 నాటికి ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామ పంచాయితీలో రైతు భరోసా కేంద్రాలను రాబోవు ఖరీఫ్, 2020 నాటికి ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ వ్యవసాయ ఉత్పాదకాలను నిల్వ చేయడానికి జిల్లాకు 5 గోదాములు (హబ్) ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించడం జరిగింది.

అన్ని రైతు భరోసా కేంద్రాలు ఏప్రియల్ 2020 మాసాంతానికి అందుబాటులోకి వస్తాయి.

ఈ రైతు భరోసా కేంద్రాన్ని గ్రామ వ్యవసాయ సహాయకుడు(వి.ఎ.ఎ.)/ ఉద్యానవన సహాయకుడు (వి.హెచ్.ఎ)/ పట్టు విభాగ సహాయకుడు(వి.ఎస్.ఎ)మరియు పశుసంవర్ధక సహాయకుడు(వి.ఎ.హెచ్.ఎ)/ మత్స్య విభాగ సహాయకుడు నిర్వహిస్తారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల వారు నిర్వహించే వివిధ గ్రామ స్థాయి కార్యకలాపాలకు ఒక వేదికగా పనిచేస్తుంది. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పట్టుపరిశ్రమ విభాగం, పశుసంవర్ధక విభాగం, వ్యవసాయ మార్కెటింగ్ విభాగం, మత్స్య శాఖ, ఏ.పి.డెయిరీ డెవలప్మెంట్ కోఆపరేషన్ విభాగం, ఏ.పి. సీడ్స్, ఏ.పి. అగ్రోస్, ఏ.పి.మార్క్‌ఫెడ్, ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, డా॥వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ విశ్వవిద్యాలయం మరియు శ్రీవేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వారి విస్తరణ కార్యకలాపాలు శిక్షణా కార్యక్రమాలు ఈ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుంది మరియు విస్తరణ కార్యకలాపాలకు రైతులకు కావలసిన అన్ని రకాల సేవలకు అందించడానికి మార్గ నిర్దేశ్యం చేయడం జరుగుతుంది. ఈ కేంద్రాలు ఏడాది పొడవునా కార్యకలాపాలు నిర్వహిస్తూ, రైతులకు నవీన మరియు తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాలు అందిస్తాయి.

**రైతు విజ్ఞాన కేంద్రాలలో రైతులకు అందించు సేవలు:**

- గ్రామ స్థాయిలో రైతులు ఎంపిక చేసుకొన్న ప్రకారం ధృవీకరించబడిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాల ఉత్పత్తుల సరఫరా.

- భూసార పరీక్ష మరియు విశ్లేషణ.
- విత్తన నాణ్యత పరీక్ష (మొలక శాతం మరియు బాహ్య స్వచ్ఛత).
- వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, పట్టుపరిశ్రమ శాఖలకు సంబంధించిన అంశాలపై శిక్షణ.
- పొలంబడి యొక్క తరగతి గది మరియు క్షేత్ర శిక్షణలు, సమావేశాలు మరియు ఉత్తమ పద్ధతులపై ప్రదర్శనలు.
- డిజిటల్ సిగ్నేజ్‌తో స్మార్ట్ టి.వి. ద్వారా శాస్త్రవేత్తల మరియు నిపుణుల తోటి ప్రత్యక్ష ముఖాముఖి ఏర్పాటు మరియు నిర్దిష్ట పంటలకు సంబందించిన యాజమాన్య పద్ధతులు మరియు సస్యరక్షణ పద్ధతులు.
- వివిధ పంటలకు సంబంధించిన సమాచారంతోటి ఒక లైబ్రరీ ఏర్పాటు.
- వ్యవసాయ యంత్ర పరికరాల బాడుగ కేంద్రాలు ఏర్పాటు.
- బీజామృతం, జీవామృతం, పంచగవ్య వంటి ప్రకృతి ఉత్పత్తుల తయారీపై శిక్షణ.
- ప్లాంట్ హెల్త్ క్లినిక్ నిర్వహణ.
- ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రాయితీ పథకాలను, రాయితీపై విత్తన, సూక్ష్మపోషకాల సరఫరా, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, జాతీయ ఆహార భద్రత మిషన్ వంటి వాటినన్నింటిని కూడా ఈ రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించడం.
- రైతుల వివరాలు మరియు సాయిల్ ప్రొఫైల్ వివరాలు అందుబాటులో ఉంచడం.
- లబ్దిదారుల యొక్క గుర్తింపు మరియు సామాజిక తనిఖీ నిర్వహణ.
- నూతన ఉత్పత్తులు, మార్కెట్‌ధరలు, నూతన సాంకేతిక పద్ధతులు, మార్కెట్‌కి సంబంధించిన విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని రైతులకు అందించడం. కొనుగోలు కేంద్రాల యొక్క సమాచారాన్ని అందుబాటులో ఉంచడం.
- ఉద్యాన పంటలు మరియు మల్బరీ పంటలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉంచడం.
- పశువులకు ఆరోగ్య కార్డులు జారీ చేయడం.
- పశువుల ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ: ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం.
- పశుసంవర్ధక శాఖ వారు ఆరోగ్య పరీక్ష నిమిత్తం పశువును నిలుపుదలచేసే 'ట్రెవిస్' ఏర్పాటు.
- ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా పశుగ్రాస అవసరాన్ని లెక్కించడం.

- రైతులకు బ్యాంకు/ఋణ సంబంధిత సందేహాలపై నివృత్తి పొందేందుకు తగిన సలహాలను, సూచనలు.
- వివిధ పంటలపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, కాస్ట్-బెనిఫిట్ ఎనాలసిస్‌లపై సమాచారం.

**విజ్ఞాన భాగస్వాములు:**

- రైతులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి మరియు రైతు భరోసా కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి ఈ క్రింది సంస్థలను విజ్ఞాన భాగాస్వాములుగా గుర్తించడం జరిగింది.
- డా॥ ఎం.ఎస్ స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్,
- సాయిల్ సైన్స్ డివిజన్, ఐ.ఎ.ఆర్.ఐ న్యూ ఢిల్లీ,
- నేషనల్ సీడ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, వారణాసి.
- ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెస్టిసైడ్స్ ఫార్ములేషన్ టెక్నాలజీ, గుర్గావ్, హర్యానా.
- నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, రాజేంద్ర నగర్, హైదరాబాద్.

ఈ సంస్థల తోటి వ్యవసాయ శాఖ ఒక అవగాహన ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకొను ప్రక్రియ ప్రారంభించింది.

ఈ ఆర్.బి.కేల ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలను గ్రామస్థాయిలో అందిస్తూ రైతుల యొక్క సంక్షేమానికి మరియు అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

కురసాల కన్నబాబు

వ్యవసాయ మరియు సహకార శాఖామాత్యులు